క్లుప్తంగా

సామూహిక వరలక్ష్మీ వ్రతానికి సర్వం సిద్ధం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక కొత్త ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న శ్రీ చక్ర సహిత శ్రీమహాలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం సామూహిత వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు దేవస్థాన నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో వార్షికోత్సవ మహా పూర్ణాహుతి సంప్రోక్షణములు, మహిళలచే సామూహిక వరలక్ష్మీ వ్రతం, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం శ్రీలక్ష్మీదేవి అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. విజయవాడ వారిచే కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

భానుకోట క్షేత్రంలో నేడు పూజలు

సింహాద్రిపురం : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన భానుకోట క్షేత్రంలోని శ్రీపార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు సురేష్ శర్మ నేతృత్వంలో వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డిలు తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనే మహిళలు ముందుగానే పేర్లు నమోదు చేసుకుని ఉదయం 10 గంటల్లోపు ఆలయానికి చేరుకోవలన్నారు. మరిన్ని వివరాలకు 9000710411 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

చింతకొమ్మదిన్నె : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఈగల్ అధికారులు తెలిపారు. గురువారం నాగిరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఈగల్(ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ కట్టడికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఈగల్ పేరుతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిందన్నారు. ఇళ్లు, పాఠశాలల సమీప ప్రాంతాల్లో ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి విక్రయాలపై సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 1972కు అందించాలని సూచించారు. సమాచారం తెలిపిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయులు మాదక ద్రవ్యాల నివారణలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, నార్కోటిక్ సిబ్బంది, ఈగల్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీడీపీవోగా బాధ్యతలు చేపట్టిన కొండమ్మ



ముద్దనూరు : ముద్దనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా జి.కొండమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న కొండమ్మకు పదోన్నతి లభించింది.

పాఠశాలకు సామగ్రి వితరణ

లింగాల : మండలంలోని అక్కులగారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం పదవ తరగతి పూర్వపు విద్యార్థుల తరపున సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రసన్న రూ.22వేలు విలువ చేసే మొబైల్ అంప్లిఫైర్, బాలికల టాయిలెట్లలోకి అవసరమైన ఇన్సిలేటర్‌ను బహూకరణగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు ప్రసన్న దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రామకృష్ణయ్య, ఇన్‌చార్జి హెడ్మాస్టర్ వాసుదేవారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి



ఠాగూర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు

జమ్మలమడుగు రూరల్ : విశ్వ కవి గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ 84వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రంథాలయాధికారి బాబ్జీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వంకం పద్మనాభం మాట్లాడుతూ గొప్ప మానవతా వేత్తగా బహుముఖ ప్రజ్ఞాశాలి ఠాగూర్ అని వివరించారు. నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి అసియా వాసి అని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైవీయూలో జాతీయ చేనేత దినోత్సవం

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ చేనేత దినోత్సవంలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి నేతన్నల కష్టాలను గుర్తుచేశారు. బ్రిటిష్ కాలంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ వస్త్రాలను ధరించాలని గాంధీజీ పిలుపునిచ్చారన్నారు.



నల్లపురెడ్డిపల్లెలో జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారానికి వెళుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు



నల్లపురెడ్డిపల్లె శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయ పట్టాభిషేక మహోత్సవం

పులివెందుల టౌన్ : పట్టణంలో గురువారం శ్రీకృష్ణదేవరాయ 516వ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం నేతలు, తెలుగు భాష అభిమానులు స్థానిక పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బలిజ సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, ఆంజనేయులు తదితరులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు భారత దేశంలో ఎన్నో గుళ్లు, గోపురాల నిర్మాణంతోపాటు తెలుగు భాష మహోన్నతకు కృషి చేశారన్నారు. అలాగే స్థానిక వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరంగనాథ ట్రస్ట్ చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులు, ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్, బలిజ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

ఎమ్మెల్సీపై దాడి చేయడం దుర్మార్గం

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి అనైతికంగా పోటీ చేసి...ఆపై దాడులు, దౌర్జన్యాలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్ అన్నారు. గురువారం పాతబస్టాండులోని మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం ఎదుట ప్లకార్డులతో బీసీ నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పదవిలో ఉండి చనిపోతే వారి కుటుంబంలోని సభ్యున్ని ఎన్నికకు నిలబెడితే అన్ని పార్టీలు మానవతా హృదయంతో అతనికి మద్దతిచ్చి ఏకగ్రీవం చేసే సాంప్రదాయం రాష్ట్రంలో కొనసాగేదన్నారు. ఇప్పుడు పులివెందుల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ చనిపోతే ఆ కుటుంబంలోని వ్యక్తినే పోటీకి నిలబెట్టామని, కానీ తెలుగుదేశం పార్టీ నైతిక విలువలకు పాతరేసి బీటెక్ రవి భార్యను పోటీకి దింపిందన్నారు. దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలకు కేరాఫ్ అయిన బీటెక్ రవి అధికార బలంతో రెచ్చిపోతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేయించడం దారుణమన్నారు. బీసీ ఎమ్మెల్సీ అయిన రమేష్ యాదవ్, వేల్పుల రాములపై టీడీపీ నాయకులు దాడి చేసి హత్యాయత్నం చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులు కూడా సకాలంలో స్పందించి దాడులను అరికట్టలేకపోయారన్నారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలకు చోటు లేదన్నారు. ఇది బీసీలపై జరిగిన దాడిగా తాము పరిగణిస్తున్నామన్నారు. రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ నిష్పక్షపాతంగా పోలింగ్ జరిపితే ఎవరి బలం ఏమిటో తెలిసిపోతుందన్నారు. దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులతో ఎన్నికల్లో గెలుస్తామనుకుంటే సాధ్యం కాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

పీ-4 సర్వేను పక్కాగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

వల్లూరు : పీ-4 సర్వేను పక్కాగా నిర్వహించాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాల సభా భవనంలో గురువారం పీ-4 సర్వేపై మండలంలోని సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పీ-4 సర్వేకు సంబంధించి కుటుంబాల అవసరాల అంచనాలను మండలంలోని సచివాలయ సిబ్బంది పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా జాగ్రత్తగా చేయాలని సూచించారు. శనివారం గ్రామ సంఘాల అధ్వర్యంలో పీ-4 బంగారు కుటుంబాల ఎంపికను తప్పులు లేకుండా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవాణి, ఎంపీడీఓ శ్రీధర్, పలువురు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ గీత

జమ్మలమడుగు : ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులకు యాజమాన్యం మౌలిక సదుపాయాలను కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ గీత తెలిపారు. గురువారం ఆమె ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో నిబంధనల ప్రకారం ఉన్నాయా లేదా అనే విషయంతోపాటు ఫైర్, బయోమెడికల్ వేస్టేజీ, పొల్యుషన్‌లకు కాలపరిమితి, ఆసుపత్రికి వచ్చే రోగులకు మరుగుదొడ్లు, తాగునీరు తగినంత సిబ్బంది ఉన్నారా అన్న విషయంపై ఆరాతీశారు. కాల పరిమితి పూర్తైతే ధృవీకరణ పత్రాలకు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు





సింహాద్రిపురంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

సింహాద్రిపురం : వినాయక చవితి ఉత్సవాలు వస్తున్నాయంటే యువతలో ఉత్సాహం, ఉల్లాసం ఉరకలేస్తాయి. ఇప్పటికే ఉత్సవ కమిటీల హడావుడి ప్రారంభమైంది. అలాగే అమ్మకాలకు వినాయక విగ్రహాలను అడుగు మట్టి విగ్రహాలు మొదలుకుని 13 అడుగుల విగ్రహాలను తయారు చేసి వాటికి చక్కటి రంగులతో ముస్తాబు చేసి విక్రయాలకు సిద్ధం చేశారు.


బిజిబిజీగా ఉత్సవ కమిటీలు

సింహాద్రిపురంలో వినాయక చవితి సంబరం అప్పుడే ప్రారంభమైంది. గతంలో ఏదో ఒక కాలనీలో వినాయక విగ్రహం చేస్తే అక్కడే పండుగ సందడి కనిపించేది. కానీ ప్రస్తుతం దాదాపు అన్నీ కాలనీల్లో, గ్రామాల్లో వినాయక విగ్రహాలు కొలువు తీరనున్నాయి. వినాయక మండపాలు, విగ్రహాలు, అవసరమైనవి సమకూర్చుకోవడంలో ఇప్పటికే ఉత్సవ కమిటీల సభ్యులు నిమగ్నమయ్యారు.


మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు ఎంతో మేలు. మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని శాస్త్రంతోపాటు పర్యావరణ ప్రేమికులు చెబుతున్నప్పటికీ ఏటా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో వినాయక ప్రతిమల సంఖ్య పెరుగుతోంది. ఇందుకు ఈ విగ్రహాలు ఆకర్షణీయంగా ఉండటంతో వాటినే ఎక్కువ మంది కొనుగోలు చేస్తారు.

నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించాలి



కమలాపురంలో మాట్లాడుతున్న వరప్రసాద్



జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మిక నాయకులు

కమలాపురం : నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించాలని చేనేత సంఘం జిల్లా కార్యదర్శి వరప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేనేత కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించాలని, అలాగే ఈ పథకం ద్వారా అమలవుతున్న రూ.24 వేల నుంచి రూ.36 వేలకు పెంచాలన్నారు. సొంత మగ్గం ఉన్న వారితో పాటు అద్దె మగ్గాల్లో నేస్తున్నటువంటి చేనేత కార్మికులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు తక్షణమే పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 11 రకాల చేనేత వస్త్ర, ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. చేనేతలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించి సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : గత ప్రభుత్వం లాగా ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా నేతన్న నేస్తం పథకం అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ కోరారు. గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోరగుడి మూడు రోడ్ల క్రాసింగ్‌లో ఉన్న చేనేత నాయకుడు మాజీ ఎమ్మెల్యే కుండా రామయ్య విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో పదిశాతం చేనేత కార్మికులు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులకు సరైన పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఆకలి బాధలతో 57 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాటా రామదాసు, చౌడం జయశంకర్ తదతరులు పాల్గొన్నారు.

ఎర్రిపల్లెలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



మహిళతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి, నరేన్‌రెడ్డిలు

పులివెందుల టౌన్ : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో భాగంగా పులివెందుల మండలం ఎర్రిపల్లె గ్రామంలో గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి, నరేన్‌రెడ్డిలు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అమలు కావడంలేదని, ఎమ్మెల్సీలపైనే దాడికి యత్నిస్తుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలేవి ప్రజలకు అందడంలేదన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలు గ్రహించారన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిపితే వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి

హెచ్ఐవీ స్థితి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

పులివెందుల టౌన్ : హెచ్ఐవీ స్థితి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ హెచ్ఐవీతో పాటు సుఖ వ్యాధులు, క్షయ వ్యాధుల గురించి వివరిస్తూ ఆ వ్యాధుల లక్షణాలు, సోకే మార్గాలు, సోకని మార్గాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటిపై చిన్న, పెద్ద అనే తేడా లేకుండా చర్చించుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే జంక్ ఫుడ్, ఫాస్ట్ అలవాటు మానుకుని నిత్యం పోషకాలతో కూడిన పౌష్టికాహారం తీసుకుంటూ ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలనారాయణ, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ శ్రీనిత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య

‘ఆశ’ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

జమ్మలమడుగు : ఆశ వర్కర్లకు జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించి మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుహాసిని, ఏఐటీయూసీని జిల్లా అధ్యక్షులు గుండి వేణుగోపాల్‌లు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలంటూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీసం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2018లో టీడీపీ ప్రభుత్వం ఆశ వర్కర్లకు రూ.3 వేలు జీతం ఇచ్చింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా రూ. 10 వేలు పెంచిందన్నారు. తమ పోరాట ఫలితంగా వయోపరిమితి పెంచడంతోపాటు గ్రాట్యుటీ లక్ష 50 వేలు, మెటర్నటీ సెలవులు ప్రకటన చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆశ వర్కర్స్, యూనియన్ నాయకులు

ఓటమి భయంతోనే టీడీపీ అరాచకాలు

కమలాపురం : పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు అరాచకాలు సృష్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ షేక్ ఇస్మాయిల్ ధ్వజమెత్తారు. గురువారం కమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలవగానే టీడీపీ అల్లరి మూకలు అరాచకాలు ప్రారంభించారని, అయితే ఈ అరాచకాలకు వైఎస్సార్ సీపీ నాయకులు కాదు కదా? కార్యకర్తలు కూడా భయపడే ప్రసక్తే లేదన్నారు. మొన్న వివాహానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు చేసిన టీడీపీ గుండాలు, బుధవారం నల్లగొండువారిపల్లెలో ప్రశాంతంగా ప్రచారం చేసుకుంటున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రాముపై దాడి చేయడంతో పాటు కార్లు ధ్వంసం చేయడం దారుణం అన్నారు.

కూటమి నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా విజయం వైఎస్సార్ సీపీదేనన్నారు. పులివెందులలో జరిగే పరిణామాలన్ని ప్రజలు గమనిస్తున్నారని, కూటమి నాయకులకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని
విజయవంతం చేయాలి

చింతకొమ్మదిన్నె : ఈనెల 12న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఆయన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నెలల నుంచి 19 ఏళ్లలోపు వారందరికి నులిపురుగుల నివారణ కోసం ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. ఈ మాత్రలు తియ్యగా ఉంటాయని, చప్పరించి మింగాలని తెలిపారు. 12వ తేదీ హాజరు కాని వారికి ఈనెల 20న ఈ కార్యక్రమం నిర్వహించి మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాడానికి ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు రాఘవేంద్ర, సునీత, ఎంఈఓ రమాదేవి, సూపర్‌వైజర్ జనార్ధన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్, అధికారులతో కలిసి ఆమె నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలపై విద్యార్థులకు చిన్నారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 12వ తేదీన మాత్రలు తీసుకోనివారికి తిరిగి 20వ తేదీన మాత్రలు అందజేస్తారని ఎంపీడీవో తెలిపారు.



ముద్దనూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీడీవో

లింగాలలో..

లింగాల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్నకుమార్ జాతీయ నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కుసుమకుమారి, సూపర్‌వైజర్ హాసియా బేగం, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

కడప సెవెన్ రోడ్స్: ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. నారాయణ యాదవ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీకి తగిన భద్రత కల్పించాలన్నారు. బీసీ వర్గానికి చెందిన ఆయన ఉన్నత స్థానంలో ఉన్నందున కొంత మంది అగ్రవర్ణ నేతలు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడటం హేయమన్నారు. యాదవ్‌లపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని కోరారు.